క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్కతుర్తి: 2024–25 విద్యా సంవత్సరానికి గాను మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ బాలికల గురుకుల పాఠశాలో ఐదోతరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవాల్సిన విద్యార్థులు జనవరి 06వ తేదీ వరకు రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థినులు అర్హులని, ఉమ్మడి గురుకుల ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పరకాల: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని 1వ వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ కోరారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా ప్రధానోపాధ్యాయుడు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలు ఆందోళన చెందొద్దు

శాయంపేట : ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులైన ప్రతిఒక్కరికీ దరఖాస్తులు ఫారాలు అందిస్తామని సర్పంచ్ రవి తెలిపారు. ప్రజలు ఆందోళన చెందొద్దని కోరారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, జీపీ సిబ్బందితో ప్రతి ఇంటికి ఒక దరఖాస్తు ఫారాన్ని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఎన్ని కుటుంబాలు ఉంటే అన్ని ఫారాలు అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్‌ను కోరినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు వైద్యుల వీరారెడ్డి అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం వీరారెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి, సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, డైరెక్టర్ ప్రకాష్ ఉన్నారు.

సిబ్బందిని నియమించాలి

కమలాపూర్: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వెంటనే సిబ్బందిని నియమించాలని సంఘమిత్ర వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మోరె రంజిత్‌కుమార్, తెలంగాణ పల్లె పరిరక్షణ సమితి అధ్యక్షుడు పెర్క భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రంథాలయంలో సిబ్బంది లేక పాఠకులు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారని, విజ్ఞానం అదించే గ్రంథాలయం తరచూ మూసి ఉంటున్న కారణంగా మండల ప్రజలు, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే గ్రంథాలయ సిబ్బందిని నియమించాలని వారు జిల్లా ఉన్నతాధికారులను కోరారు.

పెండింగ్ చలాన్లు చెల్లించాలి

దామెర: పెండింగ్‌లో ఉన్న వాహనాల చలాన్లను వెంటనే చెల్లించాలని ఎస్సై కొంక అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పెండింగ్ చలాన్ల చెల్లింపులో భారీగా రాయితీ ఇచ్చిందని, వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారీ, తేలికపాటి వాహనాలపై 60 శాతం, ద్విచక్ర వాహనాలు, ఆటోలపై 80 శాతం రాయితీతో చెల్లించే వెసులుబాటు కల్పించిందని తెలిపారు.

చిరుధాన్యాలతో పిండి వంటలు

కాజీపేట అర్బన్: సంపూర్ణ ఆరోగ్యానికి, రోగ నిరోధక శక్తికి తోడ్పడే చిరుధాన్యాలతో సంక్రాంతి పిండి వంటలు చేసుకోవాలని రికార్డ్ సర్వీసెస్ సొసైటీ అధ్యక్షురాలు కుసుమ కవిత తెలిపారు. చిరుధ్యాన్యాలతో వంటకాలపై శిక్షణ కార్యక్రమాన్ని కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిండి వంటకాల తయారీ, రాగి, జొన్న మురుకులు, కొర్ర దోశ, తదితర చిరుధాన్యాల వంటకాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యలతో పిండివంటలు చేయాలన్నారు.

నడికూడ : దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్



ఐనవోలు : మాట్లాడుతున్న ఎంపీపీ మధుమతి



దామెర : సూచనలు చేస్తున్న మాధవీలత



వేలేరు : మాట్లాడుతున్న జెడ్పీటీసీ సరిత



రెండోరోజు జనం బారులు



కమలాపూర్ : దరఖాస్తులు నింపుతున్న పోలీసులు



ఎల్కతుర్తి : దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



కమలాపూర్ : దరఖాస్తులు అందించేందుకు బారుదీరిన జనం

- ‘ఆరు గ్యారంటీలకు’ దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు
- కౌంటర్లను పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎల్కతుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం చేపట్టిన ప్రజాపాలన రెండోరోజు కొనసాగింది. శుక్రవారం ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లి–86, తిమ్మాపూర్–215, చింతలపల్లి–268, వీరనారాయణపూర్–138 దరఖాస్తులను స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 707 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జగత్‌సింగ్ తెలిపారు. అలాగే భీమదేవరపల్లి మండలం విశ్వనాథకాలనీ, కొప్పూర్, కొత్తకొండ, ధర్మారం గ్రామాల్లో గల గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రజాపాలన కౌంటర్ల వద్ద ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ వెంకటభాస్కర్, ఎంపీడీఓలు తూర్పాటి సునీత, భాస్కర్, ఏపీఎం రవీందర్, ఏపీఓ అనిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాష్‌రెడ్డి, ఏఈ లక్ష్మణ్‌నాయక్, ఏఈఓ రాజుతో పాటు పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాలకు అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలని జెడ్పీటీసీ చాడ సరిత అన్నారు. మండలంలోని లోక్యతండా, గొల్లకిష్టంపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. దరఖాస్తుల్లో తప్పులు లేకుండా నింపి అధికారులకు అందించి రసీదులను తప్పనిసరిగా తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజలు ఆందోళన చెందొద్దని, సంయమనం పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీసీఈఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కోమి, ఎంపీడీఓ లక్ష్మీ ప్రసన్న, మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్ బాబు, సర్పంచ్‌లు మురావత్ అనురాధ, పరమేశ్వరి పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఐదు గ్యారంటీ పథకాల అమలు కోసం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం రెండోరోజు కొనసాగింది. దరఖాస్తులు సమర్పించేందుకు ప్రజలు బారులు దీరారు. మండలంలోని భీంపల్లి, గుండేడు, కన్నూరు, కొత్తపల్లి గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల తదితర ఐదు పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రెండో రోజు నాలుగు గ్రామాల్లో మొత్తం 2,311 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గుండె బాబు, తహసీల్దార్ మాధవి, ఎంపీఓ విమల, ఏఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం నారాయణ, పలు శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెం, రెడ్డిపాలెం, ఒంటిమామిడిపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం శుక్రవారం రెండోరోజు కొనసాగింది. ముందుగా ఆయా గ్రామాల్లో అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఒంటిమామిడిపల్లిలో ముఖ్య అతిథిగా ఎంపీపీ మధుమతి హాజరై ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉడుతగూడెంలో 170, ఒంటిమామిడిపల్లిలో 411, రెడ్డిపాలెంలో 188 మంది దరఖాస్తు చేసుకోగా మండల వ్యాప్తంగా 484 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. 1,253 మంది ప్రభుత్వం అందించిన ఫార్మాట్ ప్రకారం దరఖాస్తు చేసుకోగా ఇతర సమస్యలపై 132 మంది దరఖాస్తులు సమర్పించినట్లు తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు.

నడికూడలో..

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లి, నార్లాపూర్, కౌకొండ, సర్వపూర్, రామకృష్ణాపూర్, చర్లపల్లి గ్రామాల్లో రెండోరోజు ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. రామకృష్ణాపూర్ గ్రామంలో తహసీల్దార్ గుండాల నాగరాజు లబ్దిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 618 దరఖాస్తులు వచ్చినటుల అధికారులు వెల్లడించారు.

దామెర : మండలంలోని ఒగ్లాపూర్, సీతారాంపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామసభల్లో మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత పాల్గొని పలు సూచనలు చేశారు. ఎంపీపీ శంకర్, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎస్సై కొంక అశోక్ పాల్గొన్నారు.

‘తిరుమల’కు చేరుకున్న భజన మండలి



అఖండనామ సంకీర్తన చేస్తున్న సభ్యులు

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి సభ్యులు శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానానికి చేరుకున్నారు. అఖండ హరినామ సంకీర్తన చేశారు. భజన మండలి జిల్లా అధ్యక్షుడు మాందాడి రాజు, మండల కార్యదర్శి తడక సదానందం, సభ్యులు తడక రవి, కుసుమ రమేష్, గజ్జి మహేందర్, వైద్యుల ప్రభాకర్‌రెడ్డి, రామ్‌రెడ్డి, సాంబరెడ్డి, మల్లయ్య, కుమారస్వామి, శంకర్, చంద్రప్రకాష్ పాల్గొన్నారు.

1 నుంచి అక్షింతల పంపిణీ



మాట్లాడుతున్న చందర్‌బాబు

ఆత్మకూరు : శ్రీరామ జన్మభూమి పూజిత అక్షింతలను జనవరి 1వ తేది నుంచి 15 వరకు పంపిణీ చేయనున్నట్లు విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందాల చందర్‌బాబు తెలిపారు. మండలంలోని ప్రతి కుటుంబానికి అందజేస్తామని అన్నారు. జనవరి 22వ తేదీన శ్రీరామ జన్మభూమిలో నూతనంగా నిర్మించిన మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో టింగిలికారి సత్యనారాయణ, నాగబండి శివప్రసాద్, వంగాల బుచ్చిరెడ్డి, ఉప్పునూతుల శంకర్‌జీ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి



జెండాను ఆవిష్కరిస్తున్న మంద శ్రీకాంత్

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలపై విద్యార్థులు పోరాడాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ సూచించారు. ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హనుమకొండలో ఎస్‌వీఆర్ జూనియర్ కళాశాలలో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం జెండాను శ్రీకాంత్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1970లో కేరళలో ఎస్ఎఫ్ఐ ఏర్పాటు అయిందని వివరించారు. అప్పటి నుంచి దేశంలో విద్యారంగ పరిరక్షణ, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, మంద వికాస్, కార్తీక్, సందీప్, శివరాజ్, కుమార్, అభిరామ్, రాజ్, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ కోటలో విద్యార్థుల సందడి



కాకతీయుల విశిష్టతను వివరిస్తున్న కోట గైడ్

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ కోటకు పలు జిల్లాలకు చెందిన విద్యార్థులు శుక్రవారం భారీగా సంఖ్యలో తరలివచ్చారు. దాంతో మధ్యకోట శిల్పాల ప్రాంగణం విద్యార్థులతో కిటకిటలాడుతూ సందడిగా మారింది. ఈ సందర్భంగా వారు అద్భుతమైన శిల్ప సౌందర్యాలను తిలకించారు. నల్ల రాతిలో శిల్పులు చెక్కిన శిల్ప సంపద, ఖుష్‌మహల్, ఏకశిల గుట్ట, రాతి మట్టికోట అందాలను వీక్షించారు. కాకతీయుల విశిష్టతను కోట గైడ్ రవియాదవ్ వివరించారు. అనంతరం ఏకశిల చిల్డ్రన్ పార్క్‌లోని ఆహ్లాదాన్ని పంచే చెట్లనీడన సేదతీరారు. కార్యక్రమంలో కేంద్ర పురావస్తుశాఖ కోట ఇన్‌చార్జ్ శ్రీకాంత్, టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ అజయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠించిన విగ్రహాలతో కమిటీ సభ్యులు

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ పుప్పాలగుట్ట ముత్యాలమ్మ దేవాలయంలో నూతన నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం వైభవంగా సాగింది. ఉదయం మండప పూజలు, ధ్యానరత్న శిలాదివాసాలు చేసి అర్చకుల మంత్రోచ్చరణల మధ్య యంత్ర ప్రతిష్ఠ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. దేవాలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని, మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో అర్చకులు వెంకటేశ్వర శర్మ, మనోజ్, శివమణి, అనికేత్ నిర్వాహకులు ఎల్.శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముస్లింలను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అఖిల్‌పాషా

నయీంనగర్: కర్ణాటకతో పాటు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ముస్లిం మైనార్టీలు ప్రధాన కారణమని, ఈక్రమంలో వారిని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.అఖిల్‌పాషా కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో ముస్లింలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రానున్న మంత్రివర్గ విస్తరణలో నాయకుడు ఎండీ.అజారుద్దీన్‌కు అవకాశం ఇవ్వాలని, అద్దంకి దయాకర్‌కు వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిత్వం ఖరారు చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు ఎండీ.మజహర్ హుస్సేన్, ఎండీ.ఫారూక్, అబిద్, నవాజ్, సతీష్ పాల్గొన్నారు.

ఇదేందయ్యా ఇది?



అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పరకాల : నియోజకవర్గంలో 13 ఏళ్ల తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం కనిపిస్తుంది. కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవిందు రవీందర్.. ఇటీవల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రమాణస్వీకారం సందర్భంగా అభినందనలు తెలుపుతూ ఓ ఫ్లెక్సీ కట్టారు. అయితే ఆ ఫ్లెక్సీలో తన ఫొటో వద్ద హోదాతో పాటు కాబోయే కౌన్సిలర్‌గా పేర్కొనడం పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఫ్లెక్సీ చూసినవారు టికెట్, గెలుపు ఖరారు కాకుండా ఇదేంటి అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

విరాహత్ అలీకి అభినందనలు



విరాహత్ అలీని సన్మానిస్తున్న జర్నలిస్టులు

నయీంనగర్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికైన విరాహత్ అలీకి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరాం, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి, వరంగల్ జిల్లా నాయకులు శ్రీరాం రామచందర్, మట్ట దుర్గాప్రసాద్, మిద్దెల రంగనాథ్, గాడిపెల్లి మధు, రజనీకాంత్ తదితరులు ఉన్నారు.

కేవీలో మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్, కేవీ కమిటీ చైర్మన్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కేవీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుభాషిణి తెలిపారు. కేవీ పీఎం శ్రీగా మారినప్పటి నుంచి చేపట్టిన అభివృద్ధి గురించి డీఈఓ అబ్దుల్‌హై, జిల్లా వైద్యాధికారులు, నిట్ ప్రొఫెసర్లు, కేవీ పబ్లిక్ వర్క్స్ అధికారులకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుభాషిణి వివరించారు. కార్యక్రమంలో కేవీ ఉపాధ్యాయులు స్మిత, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఇటికాల మధుసూదన్‌రావు సేవలు చిరస్మరణీయం

కాజీపేట అర్బన్: నాటి ఆర్ఈసీ నేటి నిట్ వరంగల్ నిర్మాణంలో ఇటివకాల మధుసూదన్‌రావు సేవలు చిరస్మరణీయమని నిట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొలిపాక కర్ణాకర్ కొనియాడారు. మధుసూదన్‌రావు 59వ వర్ధంతి సందర్భంగా నిట్ వరంగల్ మెయిన్ గేట్ ఎదుట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ రాంచందర్, సర్వేశం, పోచయ్య, రాజు, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలు గడుస్తున్నా.. పట్టింపులేదు

- భారీ వర్షాలకు కొట్టుకుపోయిన మెటల్ ఫెన్సింగ్
- ప్రమాదకరంగా మారిన చలివాగు వంతెన



గతంలో కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిన చలివాగు వంతెన మెటల్ ఫెన్సింగ్

పరకాల: ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు చూస్తే ప్రయాణికులు జంకుతున్నారు. పట్టణంలోని చలివాగు వంతెన వద్ద కొత్తగా మరో ప్రమాదం పొంచి ఉంది. ఇరుకుగా, గుంతల మయంగా మారిన చలివాగు వంతెనకు ఇరువైపుల ఉన్న మెటల్ ఫెన్సింగ్ భారీ వర్షాలకు కొట్టుకపోయి మూడు నెలలు గడుస్తున్నా ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది. వాస్తవానికి ఇదే వంతెన మీదుగా ఎన్‌హెచ్ 363 ఉండటంతో నిత్యం వేలాది వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. కాళేశ్వరం, రామప్ప వంటి పుణ్యక్షేత్రాలకే కాకుండా భూపాలపల్లి, గోదావరిఖని, మహదేవపూర్ మీదుగా మహారాష్ట్రకు వెళ్లే ప్రయాణికులకు ఇది ప్రధాన రహదారిగా మారింది. మరోవారంలో మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ముందస్తు మొక్కలు చెల్లించుకునే వారు సైతం రాకపోకలు కొనసాగిస్తుంటారు. అయితే ఇదే వంతెన వద్ద అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. వేగంగా ఏదైనా వాహనాలు దూసుకొచ్చినా, రహదారిపై కొత్తగా వాహనాలు నడిపే వారితో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మెటల్ ఫెన్సింగ్ లేకపోవడంతో ఏకంగా వాగులోకి దూసుకెళ్లే ప్రమాదం ఉందని, ప్రమాదం చోటుచేసుకోముందే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులతో పాటు పలువురు కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించాలి

- చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు దామోదర్



మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్

కమలాపూర్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఉన్నతమైన ఆలోచనలు కలిగి ఉండాలని, చట్ట విరుద్ధమైన, సమాజ వ్యతిరేకమైన ఆలోచనలకు దూరంగా ఉండాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కజాంపురం దామోదర్ సూచించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చైల్డ్ హెల్ప్‌లైన్, డీసీపీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానికి అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. చిన్నతనంలో చెడు సహవాసాలతో ఎదురయ్యే అనేక తప్పుడు అలవాట్లకు, చెడు మార్గాలకు దూరంగా ఉంటూ ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రులకు తలవంపులు తెచ్చే, సమాజం తప్పుపట్టే చెడు అలవాట్ల దూరంగా ఉండాలని, ఉన్నత విద్య, ఉత్తమ ప్రవర్తనపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తే పోలీస్ స్టేషన్ వరకు వచ్చే అవసరం ఉండదని, నేరపూరిత ఆలోచనలు చేసి నేరస్తులుగా మారితే భవిష్యత్ దెబ్బతింటుందన్నారు. కొందరు విద్యార్థులు సంఘ విద్రోహ కార్యక్రమాల వైపు పోతున్నట్లు గమనిస్తున్నామని, అలాంటి వారు ఇప్పటికైనా తమ ప్రవర్తన మార్చుకొని భవిష్యత్‌కు సంబంధించిన ఆలోచనలు చేసి ఉన్నతంగా ఎదగాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ చదువుపై ఆధారపడి ఉందని, సమయాన్ని వృథా చేయకుండా సమయానికనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజమల్లయ్య, ఐసీపీఎస్, చైల్డ్‌లైన్ ప్రతినిధులు సునీత, రజిత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ



పడి ముట్టిస్తున్న గురుస్వామి స్కైలాబ్

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన బొల్లపల్లి స్కైలాబ్ గురుస్వామి ఇంట్లో శుక్రవారం నారికేళి అయ్యప్ప మహా పడిపూజను గురుస్వామి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పడిని అలంకరించి గణపతి, లక్ష్మీదేవి, అయ్యప్పస్వామి పటాలకు అలంకరించి అష్టోత్తరాలు, మలాధరుల శరణుఘోషతో వేద మంత్రాల మధ్య అయ్యప్పకు అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలాధరులు శరణు ఘోషతో భజన చేశారు. నారికేళి అయ్యప్ప మహా పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం మహా అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు భిక్షపతి, సేనారెడ్డి, రవీందర్, శివ, సదానందం, కిషన్, శ్రీధర్, చంద్రమౌళి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.